# కమ్యూనిస్టు వ్యతిరేక విధానం, ఆధునిక సామ్రాజ్యవాదం యొక్క పచ్చి అభివృద్ధి నిరోధక సిద్ధాంతం

- ఎ.ఎం.రూమియాత్సవ్

**కమ్యూనిస్టు** వ్యతిరేక విధానం, అత్యంత క్రియాశీలకమైన అభివృద్ధి నిరోధకమైన ఆధునిక సామ్రాజ్యవాద భావజాలం. ఈ విధానం వలన ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వుండాల్సిన ఖచ్చితమైన గీత చెరిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇది దైనందిన కార్యక్రమమైంది. సోషలిజం, కమ్యూనిజంల నూతన సామాజిక, ఆర్థిక పునాదికి, కమ్యూనిస్టు సిద్ధాంతం, భావాల వ్యాప్తికి వ్యతిరేకంగా ఈ సిద్ధాంతం ఎక్కుపెట్టబడింది. కమ్యూనిస్టు సిద్ధాంత ఆచరణలను ఎదుర్కొనటానికి ఇది ఉద్దేశించబడినది. కమ్యూనిస్టు నినాదాల అమలు ప్రత్యేకంగా చేపట్టకపోయినా, కమ్యూనిస్టులతో ఐక్యకార్యాచరణను ఈ సిద్ధాంతం నిరాకరిస్తోంది.

కమ్యూనిస్టు వ్యతిరేకత అనేది మన కాలంలో విభిన్న రూపాలలో వస్తోంది. అనేక పెట్టుబడిదారీ దేశాలలో వివిధ సెక్షన్ల ప్రజల ప్రత్యేక ప్రయోజనాల్ని కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఒక పరాన్నజీవిలా కబళిస్తోంది.

ఈ సందర్భంగా ఈ క్రింది 3 రకాల కమ్యూనిజం వ్యతిరేక రూపాలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని నేననుకొంటున్నాను.

1. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఖచ్చితమైన ఒక ఆచరణాత్మక రాజకీయం. ఇది అమెరికా, ఫెడరల్ జర్మనీ తదితర దేశాలలో తరచు ప్రభుత్వ విధానంగా అమలవుతోంది. సామ్రాజ్యవాదుల నుండి ఆర్థిక సాయం పొందుతున్న కమ్యూనిస్టు వ్యతిరేక సంస్థలను ఇందులో భాగంగానే చూడాలి.
2. కమ్యూనిజం వ్యతిరేకత ఒక బూర్జువా సిద్ధాంతం. ఒక "సైన్సు". కమ్యూనిజం వ్యతిరేక "సిద్ధాంతవేత్తలు" కమ్యూనిజాన్ని "శాస్త్రీయం"గా తిరస్కరించే ప్రయత్నాలన్నీ ఆచరణాత్మక రాజకీయాలతో ముడిపడి వున్నాయి. వాటిని నెరవేర్చేవిగా వున్నాయి.
3. ఈ మూడవ కమ్యూనిజం వ్యతిరేక రూపం, సొంత ఆస్తి సంబంధాలపై ఆధారపడి వుంది. ఇది సామ్రాజ్యవాద బూర్జువావర్గం విశాల జనబాహుళ్యంలో చేసిన దుష్ప్రచారం వల్ల వచ్చింది.

ఈ మూడు ప్రాథమిక రూపాలు పరస్పరం పెనవేసుకొని వుంటాయని చెప్పనవసరం లేదు. కాని వాటిని విడివిడిగా పరిశీలించటం మంచిదనుకొంటున్నాను. దీని వలన నిర్దిష్ట ప్రయోజనాలు చేకూరుతాయి.

కమ్యూనిజం వ్యతిరేక ప్రచారం కొత్తదేమీ కాదు. కొత్తగా కనిపెట్టబడిందీ గాదు. కమ్యూనిజం భావాలు పుట్టి పెరిగి, జనంలో వ్యాప్తి చెందటం వల్ల వచ్చిన ప్రతిచర్య ఇది. కమ్యూనిస్టు మానిఫెస్టోలో కారల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు ఎప్పుడో ఇలా చెప్పారు : 'కమ్యూనిజం దెయ్యాన్ని వదిలించుకొనటానికి పాత యూరప్ ప్రభుత్వాలన్నీ పవిత్ర కూటమిగా ఏర్పడినాయి. పోప్, జార్, మెటిర్నిక్, గ్యూజాట్, ఫ్రెంచి రాడికల్స్, జర్మన్ పోలీసు గూఢచారులు కూడ ఈ కూటమిలోని వాళ్లే.'

మహత్తర అక్టోబరు సోషలిస్టు విప్లవ విజయానంతరం కమ్యూనిజం వ్యతిరేక ప్రచారం అనేక పెట్టుబడిదారీ దేశాల అధికార విధానంలో అంతర్భాగమైంది. సోవియట్ ప్రభుత్వం, సోవియట్ రష్యా ప్రజలు సాధించిన ఘన కార్యాలకు వ్యతిరేకంగా ఈ విధానం ఉద్దేశించబడింది. మన కాలంలో అనేక పెట్టుబడిదారీ దేశాలలో, ప్రధానంగా అమెరికాలో, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం హానికరమైన విధానంగా తయారైంది. ఈ ప్రచారంలో చారిత్రకంగా కూలిపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు రక్షకుడి పాత్రలో ప్రపంచ పోలీసుగా, ప్రపంచ అభివృద్ధి నిరోధకులకు కంచుకోటగా అమెరికా అన్నిటికంటే ముందున్నది. సోషలిస్టు శిబిరానికి వ్యతిరేకంగా సాగించే ప్రచ్ఛన్న యుద్ధంలో సామ్రాజ్యవాదానికి కమ్యూనిజం వ్యతిరేకతే సైద్ధాంతిక పునాదిగా వుంది.

పెట్టుబడిదారీ దేశాలలో, కార్మికులతో సహా చెప్పుకోదగ్గ ప్రజానీకంపై కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచార ప్రభావం వుంది. ప్రజలలో రాజకీయ చైతన్యం లోపించటం, వెనుకబాటుతనం, నిర్మాణయుత సంస్థలు లేకపోవటం, సామాజికాభివృద్ధి ఫలితాలను పొందేవారి మధ్య ఐక్యతా లేమి వలన ఈ ప్రభావం వుందని మనం అర్థం జేసుకోవాలి. ఈ కారణంగా బూర్జువావర్గం స్థానం పదిలంగా వుంది. కొంతమంది సొంత ఆస్తి, ఆస్తి సంబంధాలపై భ్రమలతో కమ్యూనిస్టు వ్యతిరేకతకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నారు. శత్రువు కమ్యూనిజాన్ని వక్రీకరించి, అసహ్యకరంగా చిత్రీకరించాడు. ఇదే చాలా మందిలో పూర్తి కమ్యూనిస్టు వ్యతిరేక భావన ఏర్పడటానికి దారితీసింది.

అంతే గాకుండా మితవాద సోషల్ డెమోక్రట్లు ప్రజలలో సంస్కరణ భ్రమలను, కమ్యూనిస్టులపై విద్వేషాన్ని వ్యాప్తి చేశారు. దీని వలన ప్రజలలో ముఖ్యంగా కార్మికవర్గంలో ఒక కలుషిత సిద్ధాంత ప్రభావం ఏర్పడింది.

సామ్రాజ్యవాద బూర్జువావర్గం, కమ్యూనిజం వ్యతిరేకతను తన ప్రధాన సిద్ధాంత, రాజకీయ ఆయుధంగా ఎందుకు ఎంచుకుంది?

ఈ ప్రశ్నకి జవాబు చెప్పాలంటే ప్రపంచంలో జరిగిన గొప్ప పరిణామాలను పరిగణనలోకి తీసుకోవాలి. పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన ఈ యుగం స్వభావాన్ని, సారాన్ని నిర్ణయించింది. సామాజిక, ఆర్థిక కోణంలో చూస్తే, సామ్రాజ్యవాదం కమ్యూనిస్టు వ్యతిరేకతను ప్రధాన సిద్ధాంత, రాజకీయ ఆయుధంగా చేసుకొనటానికి పెట్టుబడిదారీ విధానం మూడవ దశలోకి అంటే సాధారణ సంక్షోభంలోకి కూరుకుపోవటానికి మధ్య హేతుబద్ధమైన సంబంధం వుందని చెప్పాలి.

నేటి పెట్టుబడిదారీ సమాజ పాలనా ప్రక్రియను శాసిస్తున్న సూత్రం దాని సాధారణ సంక్షోభం. నూతన సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భవించి దాని సరసన నిలబడింది. ఇక ఏ విధంగానూ పెట్టుబడిదారీ విధానం ప్రాపంచిక వ్యవస్థ కాదు. ఇదే దాని ప్రధాన రోగ లక్షణం. పెట్టుబడిదారీ విధానం సాధారణ సంక్షోభం తొలి దశలలో, సోవియట్ రష్యా పెట్టుబడిదారీ వలయంలో చుట్టుముట్టబడి చారిత్రకాభివృద్ధి దశను నిర్దేశించలేకపోయింది. కాని ఇపుడు పెట్టుబడిదారీ విధానం మూడవ దశ సంక్షోభంలో "మానవజాతి చారిత్రకాభివృద్ధిలోని సారాన్ని, దిశను, ప్రధాన తీరు తెన్నులను నిర్ణయించేది ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు, సామాజిక సోషలిస్టు పునర్నిర్మాణం" (సిపిఎస్‌యు కార్యక్రమం). మన కాలంలో సాధించిన అభివృద్ధి, జనబాహుళ్యంలో సోషలిస్టు భావాలకు వచ్చిన ఆదరణ వలన వచ్చిన మార్పు ఇది. అందువల్ల సోషలిస్టు ప్రత్యామ్నాయం మినహా, పెట్టుబడిదారీ విధానానికి మరో భవిష్యత్తు లేదు.

పెట్టుబడిదారీ విధానం సూత్రాలు సోషలిజాన్ని అడ్డుకోలేవు. సోషలిజం అభివృద్ధిని నిర్ణయించేది దాని అంతర్గత సూత్రాలే గాని ఇతరములేవీ కావు. సామ్రాజ్యవాద దురాక్రమణ ప్రమాదం సోషలిజానికి బాహ్య కారణంగా వున్నప్పటికీ ఇప్పుడున్న పరిస్థితిని అది మార్చలేదు. అంతే కాదు, ఆ మార్గం కూడ ఈనాడు పూర్తిగా మూసివేయబడింది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం, ఆ ఉద్యమానికి ప్రాతినిధ్యంగా వున్న మెజార్టీ కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల చేత "కమ్యూనిస్టు మానిఫెస్టో"గా గుర్తింపబడిన సిపిఎస్‌యు ప్రోగ్రాం సరిగ్గా ఇలా చెప్పింది – "మానవజాతి అత్యధిక జనబాహుళ్యంపై సామ్రాజ్యవాదం తన అధికారాన్ని శాశ్వతంగా కోల్పోయింది".

మానవ సమాజాభివృద్ధికి భరోసా యిచ్చే సామాజిక వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానం ఎంతో కాలం మనలేకపోయింది. పెట్టుబడిదారీ విధానం కూలిపోతుందని తెలుసుకున్న తర్వాత బూర్జువా సిద్ధాంతవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజల మనసుల్ని విషపూరితం చేయటానికి చేయాల్సినదంతా చేశారు. కమ్యూనిజాన్ని వక్రీకరించి దానికి వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించారు. ఆ విధంగా ఎదురులేని విప్లవ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని అడ్డుకోవాలనుకొన్నారు.

తన పతనాన్ని వాయిదా వేయటానికి పెట్టుబడిదారీ విధానం మార్గాల్ని అన్వేషిస్తోంది. ఆర్థిక రంగంలో ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానం అవలంబించింది. రాజకీయ రంగంలో అభివృద్ధి నిరోధక మార్గం వైపు మొగ్గింది. బెదిరించటం లేదా బుజ్జగించటం, సరికొత్త హింసాయుత పద్ధతులకు దిగటం, మోసం, అంతులేని వాగ్దానాలు, అసలు సమస్యను ప్రక్కతోవ పట్టించటం, అసంగత విషయాలను లేవనెత్తటం, సామ్రాజ్యవాదం యొక్క అభివృద్ధి నిరోధక విధానంగా వుంటుందని లెనిన్ అనేకసార్లు చెప్పాడు. సైద్ధాంతిక రంగంలో ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానం కమ్యూనిజం వ్యతిరేకతను విచ్చలవిడిగా వ్యాపింపజేస్తుంది. ఇవన్నీ పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంలోకి చొచ్చుకుపోతాయి.

పెట్టుబడిదారీ విధానంలోని లోపాల్ని కప్పి పుచ్చటానికి, అది ఆకర్షణీయంగా, గౌరవంగా కనిపించేటట్టు చేయటానికి బూర్జువావర్గం వరుస భ్రమలను కలుగజేస్తుంది. గాత్‌బ్రైట్ "సంపన్న సమాజం" సిద్ధాంతం, రోస్టోల్ "దశల వారీ సామాజికాభివృద్ధి" సిద్ధాంతం, బూర్జువా సిద్ధాంత వేత్తలు అభివృద్ధి చేసిన "సాంకేతిక స్వామ్యం", "మేనేజిమెంటు నిర్వహణలో విప్లవం" తదితర సిద్ధాంతాలన్నీ అనివార్యంగా కమ్యూనిస్టు వ్యతిరేక విధానంతో ముడిపడినవే. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రయోజనాలను నెరవేర్చేవే.

కమ్యూనిస్టు వ్యతిరేక సిద్ధాంతం, కార్యక్రమం సోషలిస్టు దేశాలకు, కమ్యూనిజానికి వ్యతిరేకంగా మాత్రమే ఎక్కుపెట్టబడిందనే అభిప్రాయం విస్తృతంగా వున్నప్పటికీ, ఈ సందర్భంగా నేనొకటి చెప్పదలిచాను. మన ఉద్యమాన్ని వ్యతిరేకించే శక్తుల పట్ల సరైన అవగాహన లేకుండా, సరైన ఎత్తుగడలను రూపొందించటం అసాధ్యం గనుక దీనిని మనం జాగ్రత్తగా పరిశీలించాలి. కమ్యూనిజం వ్యతిరేకత అనేది కేవలం కమ్యూనిజం యెడల ప్రతికూలత మాత్రమే కాదు. అది గుత్త పెట్టుబడిదారీవర్గం అసలైన సైద్ధాంతిక, రాజకీయ ఉద్దేశాలను కప్పిపుచ్చే అడ్డుతెర కూడ.

పెట్టుబడిదారీ విధానం ఇబ్బందులలో వుందని కమ్యూనిస్టు వ్యతిరేకత మాటున గుత్త పెట్టుబడిదారీ సిద్ధాంతవేత్తలు, రాజకీయ నాయకులు పరోక్షంగా అంగీకరిస్తున్నారు. అయితే దీనికి కారణం పెట్టుబడిదారీ అభివృద్ధి అంతర్గత సూత్రాలలో లేదని, "బాహ్య కారణమే"నని చెప్పటానికి ప్రయత్నిస్తున్నారు. పెట్టుబడిదారీ ప్రపంచంలోని అన్యాయాలకి మూలం బూర్జువా

వర్గమేననీ, అభిశంసన నుండి బయటపడటానికి, ఆ నెపాన్ని సోషలిస్టు దేశాలపై నెట్టటానికి గుత్త పెట్టుబడిదారీ వర్గం కమ్యూనిస్టు వ్యతిరేక ముసుగులో దాక్కొంటున్నది.

సోవియట్ కమ్యూనిస్టులు ప్రపంచాన్ని జయించటానికి సిద్ధమైనారనే పచ్చి అబద్ధమే కమ్యూనిస్టు వ్యతిరేకత వెనుక వున్న ప్రాథమిక సిద్ధాంతం. ఎన్నడూ దానిని ఋజువు చేయలేక పోయారు, ఎందుకంటే ఎలాంటి ఆధారమూ లేదు గనుక. అయినా చివరి వరకూ చెప్పిందే చెబుతారు. చాలామంది ఒకటో, రెండో అబద్ధాలు నమ్మవచ్చు. కారణం అవి నిజం గావటం వలన కాదు. వాళ్ళ బుర్రల్లోకి బలవంతంగా ఎక్కించటం వలన. ఈ రకమైన బూర్జువా ప్రచారం గురించి లెనిన్ అనేకసార్లు చెప్పాడు : "అబద్ధాన్ని గట్టిగా చెప్పు". "ఎలుగెత్తి చాటింపు వేయి", "మళ్లీ మళ్లీ అబద్ధాన్ని వల్లించు", "ఏదో ఒకటి నిజమని నమ్మే వరకు".

ఆయుధ సరఫరాను సమర్ధించుకోవటం, 'ప్రపంచంపై దండెత్తు'తారనే నెపంతో కమ్యూనిస్టులతో చర్చలకు నిరాకరించటం, మరో ఆలోచన గలవారిని అణచివేయటం కోసం దూరదృష్టితో ముందుగానే ఒక ఆలోచనకొచ్చి నిందల్ని వేశారు. భావాలే విధేయతకు కొలమానం. ఆ కారణంగా చాలామంది ఏ అభిప్రాయాల్ని కలిగి వుండటానికి యిష్టపడరు. అమెరికన్ లాయర్ యఫ్.డానర్ "అమెరికన్‌లు కాని వారు" అనే తన పుస్తకంలో ఇలా అన్నాడు: ఒక మంచి న్యూక్లియర్ పాలసీ కమిటీలో చేరి శాంతి కోసం ఏదో చేయాలని అమెరికన్ పౌరులు కోరుకుంటారు. కాని మితవాదులు 'కమ్యూనిస్టు'లని ముద్రవేస్తారేమోనని, దాని వలన విపత్కర పరిణామాలేర్పడతాయేమోనని భయపడతారు.

పెట్టుబడిదారీ సమాజంలోని పరిమిత ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను అణచివేయటానికి కమ్యూనిజం వ్యతిరేకత అనేది ఒక కపటమార్గం. కమ్యూనిస్టు వ్యతిరేక విధానం ఫాసిజానికి మంత్రసానిలా పనిచేస్తుంది. అన్ని అసహ్యకర పద్ధతులకు ఫాసిజం స్థావరంగా వుంటుంది. సిపిఎస్‌యు ప్రోగ్రాంలో నొక్కి చెప్పిన ఈ అంశాన్ని మననం చేసుకోవాలి." "కమ్యూనిస్టు వ్యతిరేకతగా ఫాసిజం అన్ని చోట్లా ప్రారంభమవుతుంది. కార్మికవర్గ పార్టీలను మొదట వేరుచేసి తుదముట్టిస్తుంది. శ్రామికశక్తులను చేర్చి, నుజ్జునుజ్జుగా ఓడిస్తుంది. అప్పుడు ప్రజాస్వామ్య పార్టీలు, సంస్థల పని పడుతుంది. చివరికి గుత్త పెట్టుబడిదారీ విధానానికి ప్రజల్ని గుడ్డిగా ఉపయోగపడే పనిముట్లుగా మారుస్తుంది."

కమ్యూనిస్టు వ్యతిరేక విధానం సైన్యంతో, సైనికతత్వంతో ప్రత్యక్షంగా ముడిపడి వుంటుంది. ఈ ముసుగు క్రింద మరో యుద్ధానికి కుట్రలు పన్నుతూ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దురాక్రమణ శక్తులు తమ పనులను కానిస్తుంటారు. "సహజీవనం కంటె విడిగా వుండటమే మేలు", "కమ్యూనిస్టుగా బ్రతకటం కంటె చావడం మేలు" – కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంలో మానవజాతి శత్రువుల దుర్మార్గపు కేకలు ఇవి. ఈనాటి కమ్యూనిస్టు వ్యతిరేక శక్తుల దురాక్రమణ యత్నాలు కూలిపోవటం ఖాయం. ఇది మా దృఢ విశ్వాసం. కమ్యూనిస్టు వ్యతిరేకులను ఎదిరించి పోరాడే శక్తుల బలంపై ఆధారపడి మేమీ అభిప్రాయాని కొచ్చాం. ఇవి భావాలకే పరిమితమైన శక్తులు కాదు. మేం భౌతికవాదులం. నేల విడిచి సాము చేయలేం. మా శత్రువుకు కూడ ఇది తెలుసు. అందుకే తమ వాదనలు వీగి పోకుండా జాగ్రత్త పడతారు.

కమ్యూనిజం శత్రువుల దుస్సాహసాన్ని మనం తక్కువ అంచనా వేయగూడదు. ఫాసిజం తలెత్తినప్పుడల్లా తప్పుడు కమ్యూనిస్టు వ్యతిరేక నినాదాల్ని, జాతీయోన్మాదాన్ని మనం ఎదుర్కొంటాం. ఫాసిస్టు ఉద్యమానికి ప్రజాపునాదిని నిర్మించటానికి పెట్టుబడిదారులు ఈ నినాదాల్ని రూపొందిస్తారు. అనేక పెట్టుబడిదారీ దేశాలలో, మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచంలోని అస్థిరతను, సంక్షోభాన్ని అభివృద్ధి నిరోధకులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటారు. మొదట ప్రజల్ని భయపెడతారు. తర్వాత 'విముక్తి'ని ప్రసాదిస్తామంటారు. ప్రజలకు సైద్ధాంతిక మత్తుమందుగా మాస్ హిస్టీరియాను రెచ్చగొట్టటానికి కమ్యూనిస్టు వ్యతిరేకతను, జాతీయోన్మాదాన్ని సాధనాలుగా చేసుకుంటారు.

నైతికంగా, ఆర్థికంగా, గుత్త పెట్టుబడి ప్రధానంగా అమెరికన్ గుత్త పెట్టుబడి నూటికి నూరుపాళ్లు కమ్యూనిజానికి వ్యతిరేకంగా బహిరంగంగా యిచ్చే సాయానికి థాంక్స్ చెప్పాలి. ఆ సాయానికి గౌరవప్రదమైన "ట్రేడ్ మార్క్" వుంది. పెట్టుబడిదారీ ప్రపంచంలో అది "రాజకీయ" పెట్టుబడిగానూ వుంది.

నిజానికి ఇదో అసంబద్ధమైన పరిస్థితి. కమ్యూనిస్టు వ్యతిరేకులు ఒకవైపు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి విశ్వాసంగా వుంటామని ప్రమాణం చేస్తారు. మరోవైపు కమ్యూనిజంపై పోరాటం పేరుతో ప్రజాస్వామ్యం, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగే నేరాన్ని న్యాయమైనదిగా పరిగణించమంటారు. దక్షిణకొరియా, అర్జంటైనాలలో సైనిక కుట్రలు, దక్షిణ వియత్నాంలో క్రూర నియంతృత్వం, పోర్చుగల్‌లో ప్రదర్శకులపై కాల్పులు, స్పెయిన్‌లో సమ్మెలను భయంకరంగా అణచివేయడం, అల్జీరియాలో ఫాసిస్టు టెర్రర్, షోంబే దుర్మార్గపు హత్యలోని ట్విస్టులు, దక్షిణాఫ్రికా స్థానిక ప్రజల నివాసాల్ని మురికివాడలుగా మార్చడం – వీటన్నిటిని కమ్యూనిస్టు వ్యతిరేకత పేరుతో సమర్ధించేవాళ్లు పెట్టుబడిదారీ ప్రపంచంలో వున్నారు.

వలసవాదాన్ని ఎదిరించే చాంపియన్‌గా వున్న జాతీయ విముక్తి ఉద్యమానికి కమ్యూనిస్టు వ్యతిరేక విధానం శత్రువుగా వుంది. తమ ఆధిపత్యాన్ని ధిక్కరించే ప్రతి విముక్తి ఉద్యమాన్ని "కమ్యూనిస్టు కుట్ర"గా సామ్రాజ్యవాదం బూర్జువా వర్గం

ప్రకటిస్తుంది. వాస్తవంగా కమ్యూనిస్టు వ్యతిరేక విధానాన్ని విచారణ చేయాల్సింది, దాని సిద్ధాంతవేత్తల అలంకారప్రాయమైన సుదీర్ఘ విస్తృత రచనలను బట్టి కాదు. దాని రాజకీయ నాయకుల దుశ్చర్యలను బట్టి మాత్రమే. ఈ పద్ధతిని అనుసరించే మనం కమ్యూనిజం వ్యతిరేక విధానం మానవజాతి శత్రువని ముద్రవేయగలుగుతున్నాం.

పెట్టుబడిదారీ విధానం సాధారణ సంక్షోభం తీవ్రతరమైన కొద్దీ, కమ్యూనిస్టు వ్యతిరేక విధానం కమ్యూనిజానికి మాత్రమే గాక, సమకాలీన విముక్తి ఉద్యమాలకు, అభ్యుదయ, ప్రజాస్వామ్య ఉద్యమాలకు ప్రతికూలంగా తయారవుతుంది. అదే సమయంలో నిరంకుశ పోలీసు ప్రభుత్వాలతో, మోరల్ దేర్మామెంట్, జాన్‌బిర్క్ సొసైటీ, ఓఎఎస్, రెడ్‌హండ్ తదితర పచ్చి అభివృద్ధి నిరోధక రాజకీయ సంస్థలతో చేతులు కలుపుతుంది. ఈ సంస్థలు తటస్థమంటూనే పెట్టుబడిదారీ విధానానికి నమ్మకమైన మిత్రులుగా వుంటారు.

కమ్యూనిస్టు వ్యతిరేకత పెరుగుతుంది అంటే దాని తార్కిక అర్థం, అనివార్యంగా అది బహిరంగ చర్యలకు దిగుతున్నట్టే. సోషలిస్టు దేశాలకు, జాతీయ విముక్తి ఉద్యమాలకు, కార్మికోద్యమాలకు వ్యతిరేకంగా జరిపే "పవిత్ర యుద్ధాల"లో బహిరంగంగా పాల్గొనని వారిని కమ్యూనిస్టులుగా, కమ్యూనిస్టు అనుకూలురుగా ముద్రవేస్తూ మిలిటెంటు కమ్యూనిస్టు వ్యతిరేక విధానము, దానికి ప్రాతినిధ్యం వహించే తీవ్ర అభివృద్ధి నిరోధకులు అత్యంత క్రూరమైన చర్యలకు పాల్పడతారు. కమ్యూనిస్టులను, "అనుమానిత" ప్రజాస్వామ్యవాదులను కాన్సంట్రేషన్ క్యాంపులకు పంపాలని, సోషలిస్టు దేశాలతో అన్ని దౌత్య సంబంధాలను తెంచుకోవాలని, సోషలిస్టు శిబిరంతోనే గాక, తమ విధానాలను ఒప్పుకోని ఇతర దేశాలతో కూడ వ్యాపారాన్ని మూసివేయాలని తమ సిద్ధాంతకర్తలైన జనరల్ వాకర్, పాత్రికేయుడు డేవిడ్ లారెన్స్ ద్వారా వాదిస్తారు.

ఈ తీవ్రవాద కమ్యూనిస్టు వ్యతిరేకులతో పాటు, సైద్ధాంతిక, రాజకీయ రంగంలో "జాగరూకత గల కమ్యూనిస్టు వ్యతిరేకులు" కూడ వున్నారు. తమ దేశ ప్రజలలో భ్రమలు కలుగజేయటానికి, ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని తమ వైపు త్రిప్పుకోవటానికి వీరు "నియంతృత్వ" ప్రమాదానికి తీవ్రంగా కలవరపడుతున్నట్టు, న్యాయం, శాంతి కోసం ఆందోళన చెందుతున్నట్టు ప్రజాస్వామ్యం, ప్రగతికి ఉదాత్త హృదయం గల మొనగాళ్లుగా ఫోజులిస్తారు. తీవ్రవాద కమ్యూనిస్టు వ్యతిరేకుల లక్ష్యాలతో వీరు ఏకీభవిస్తారు. కాని సాధించే మార్గాన్ని ఎన్నుకోవటంలో ఈ "జాగరూకతగాళ్లు" అప్రమత్తతగా వుంటారు. ప్రజలలో ఎక్కడా తమకు తాము బహిర్గతమవరు. ప్రజలలో ఇంకా అధికారాన్ని, పలుకుబడిని, కొంత ప్రతిష్టను కలిగి వుంటారు. అందువల్ల వారు అత్యంత ప్రమాదం.

కమ్యూనిజం వ్యతిరేకత అంటే ప్రధానంగా ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ ప్రయోజనాలను వ్యక్తీకరించటమే. ప్రజా విముక్తి ఉద్యమాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు వ్యతిరేకులకు ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానం ఒక సిద్ధాంత, రాజకీయ ఆయుధంగా వుంటుంది. అందువల్ల కమ్యూనిజం వ్యతిరేకతను బహిర్గతం చేయడానికి ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటానికి మధ్య విడదీయరాని సంబంధం వుంది. అలా బహిర్గతం చేయటం పోరాట రూపాలలో ఒకటిగా వుంది.

ప్రజాస్వామ్య దశలో ఇప్పుడున్న పరిస్థితిలో ప్రజావిముక్తి ఉద్యమం, అభివృద్ధి చెందిన దేశాలలో ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా, ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో అంతర్జాతీయ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గురిపెట్టాలి. ఈ ఉద్యమ విజయం కోసం కార్మికవర్గం శ్రమజీవుల్ని, జాతీయ, గుత్త పెట్టుబడిదారేతర బూర్జువావర్గాన్ని కలుపుకొని విశాల ప్రజాస్వామ్య ఐక్య సంఘటనను ఏర్పాటు చేయాలి. కమ్యూనిస్టు వ్యతిరేక విధానాన్ని బహిర్గతం చేయటమంటే ఈనాటి ప్రజానీకంలోని కొన్ని సెక్షన్లలో వున్న కమ్యూనిస్టు వ్యతిరేక పిచ్చి ఆలోచనలను పారద్రోలటమేనని, దూకుడుగా వుండే కమ్యూనిస్టు వ్యతిరేకులను వేరుచేయటమేనని గ్రహించాలి.

కమ్యూనిస్టు వ్యతిరేక విధానాన్ని ఎదిరించే పోరాటంలో కమ్యూనిస్టులు ఒంటెత్తు పోకడలకు పోగూడదు. అలా చేస్తే మనకు మనం ఏకాకులవుతాం. మన వ్యతిరేక శక్తులలోని తేడాలను చూడటం అవసరం. శత్రు శిబిరంలోని వైరుధ్యాలను అవకాశంగా వాడుకోవాలి. దూకుడుగా వుండే కమ్యూనిస్టు వ్యతిరేకులతో కలిసి ప్రయాణం చేయని పెట్టుబడిదారీ సిద్ధాంత వేత్తలలో మంచివారెందరో వున్నారు. దీనిని గమనంలోకి తీసుకొని మనం మన పోరాట ఎత్తుగడలను రూపొందించుకోవాలి. మన సిద్ధాంత, విధానాలకు ప్రాథమికంగా హానిగానప్పుడు, ప్రతి అంశంపైన ఏకాభిప్రాయానికి రావాలనుకోవటం పొరబాటు అవుతుంది. అలా చేయటమంటే కమ్యూనిస్టు వ్యతిరేకులతో చేసే ప్రతి పోరాటాన్ని పాడు చేయటమే. మనల్ని ఇంకా అంగీకరించని అనేక మందిని దూరం చేసుకోవడమే.

ఇదే సమయంలో జాన్‌బిర్క్ సొసైటీ లాంటి విషతుల్యమైన తీవ్రవాద వ్యతిరేక సంస్థలను మాత్రమే పరిగణనలోకి తీసుకొనే రివిజనిస్టుల, అవకాశవాదుల అభిప్రాయాలతో సహజంగా మనం అంగీకరించలేం. అలాంటి అభిప్రాయాలు కమ్యూనిస్టు వ్యతిరేకతను "హానిలేని"దిగా కొట్టిపారవేయటమవుతుంది. ప్రజలను విడదీస్తుంది. శత్రువు నోటికి ఆహారాన్ని అందించినట్లవుతుంది. అందువల్ల కమ్యూనిస్టు పార్టీలకు, శ్రామిక విముక్తి ఉద్యమాలకు కమ్యూనిస్టు వ్యతిరేక శక్తుల బలాన్ని తక్కువ లేదా ఎక్కువ అంచనా వేయటం ప్రమాదకరం.

"మనతో లేనివాడు ఎవడైనా మనకు వ్యతిరేకుడే". ఈ నినాదంతో కమ్యూనిస్టు వ్యతిరేకులతో పోరాటాన్ని చేయలేం. బహిరంగంగా, సిగ్గూ ఎగ్గూ లేకుండా మనకు వ్యతిరేకులైనవాళ్లు మనతో ఎలాగూ వుండరు. సామ్రాజ్యవాదానికి, గుత్తాధిపత్యానికి, సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధాలకు వ్యతిరేకంగా, జాతీయ విముక్తి కోసం, శ్రామిక ప్రజలకు మెరుగైన జీవితం కోసం, నిజమైన స్వేచ్ఛ కోసం ప్రతిచోట పోరాట యోధులుగా ముందు వరుసలో వున్న కమ్యూనిస్టులను అణచివేస్తున్నారు. అలాంటప్పుడు ఆధునిక ప్రపంచంలో కేవలం శాంతి, ప్రజాస్వామ్యం, ప్రగతి కోసం మాత్రమే పోరాడటం అసాధ్యం. కనుక రోజువారీ ఆర్థిక, రాజకీయ, సిద్ధాంత పోరాటంలో పాల్గొని ప్రజలకి నచ్చచెప్పే విధంగా మన ప్రయత్నం వుండాలి.

కమ్యూనిస్టు వ్యతిరేకులతో పోరాటం అంటే కేవలం కమ్యూనిజం కోసమే అని కాదు. కనీసం దాదాపు అలాంటి పోరాటం అని కూడ కాదు. ప్రజల ప్రజాస్వామిక పోరాటాన్ని విశాలపరిచే లక్ష్యంగా మన ప్రచారం వుండాలి. కమ్యూనిస్టులు పాల్గొన్న ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమంలో ఇలాగే వ్యవహరించారు. ఈనాటి శాంతి ఉద్యమం కూడ ఇలాగే జరగాలి. ఇక్కడ సమస్య ఏమిటంటే, ప్రజాస్వామ్యం, ప్రగతి కోసం పోరాడుతుంటే కమ్యూనిజాన్ని ఎదుర్కోవటం పేరుతో సామ్రాజ్యవాద బూర్జువావర్గం దానిని అణచివేస్తోంది. కమ్యూనిజం వ్యతిరేకత అంటే అంతటా అభివృద్ధి నిరోధక దాడేనని ఇక్కడ ముఖ్యంగా నొక్కి చెప్పాల్సిన విషయం.

సిపిఎస్‌యు ప్రోగ్రాం ఇలా చెప్పింది : "కమ్యూనిస్టు వ్యతిరేక ముసుగులో సామ్రాజ్యవాద అభివృద్ధి నిరోధకులు అభ్యుదయవాదులను, విప్లవకారులను హింసిస్తోంది, వేటాడుతోంది. అది వారు కార్మికశ్రేణులకు చీల్చి శ్రామిక పోరాట పటిమను శక్తిహీనం చేయాలని చూస్తున్నారు. ఈ నల్ల జెండా వెనుక ఈనాడు ఆర్థిక, మిలటరీ ముఠాలు, ఫాసిస్టు, అభివృద్ధి నిరోధక మతాధిపతులు, వలసవాదులు, భూస్వాములు, సామ్రాజ్యవాద, అభివృద్ధి నిరోధక శక్తులు అందరూ సమీకృతులైనారు".

దాని స్వభావ రీత్యా చూస్తే కమ్యూనిజం వ్యతిరేక విధానం అంటే అబద్ధం, దగా, సోషలిజంపై అపనిందలు, మార్క్సిస్టు–లెనినిస్టు కమ్యూనిస్టు పార్టీల విధానాల్ని, లక్ష్యాల్ని తప్పుగా చిత్రీకరించే ఒక వ్యవస్థ తప్ప మరేమీ గాదు. లెనిన్ ఇలా రాశారు : "ఎప్పుడైతే బూర్జువావర్గ సిద్ధాంత ప్రభావం కార్మికులలో తగ్గుముఖం పట్టి బలహీనపడుతుందో, అప్పుడల్లా అది అనివార్యంగా నిరాశతో అబద్ధాలకు, దుర్మార్గాలకు పాల్పడుతుంది".

ఈ అర్థంలో ఈ యుగంలో కమ్యూనిజం వ్యతిరేకత అంటే బూర్జువావర్గ రాజకీయ సిద్ధాంతంలోని అంతర్గత అభివృద్ధి తార్కికంగా ముగిసిపోయినట్లే, సిపిఎస్‌యు ప్రోగ్రాం గట్టిగా చెప్పింది : "కమ్యూనిజం వ్యతిరేకత అంటే పూర్తిగా కుళ్లిపోయిన బూర్జువా సిద్ధాంతానికి ప్రతిబింబమే".

తన కిరాయి లక్ష్యాలను సాధించటానికి ఈనాడు సామ్రాజ్యవాద బూర్జువావర్గం క్రూరమైన మతోన్మాదానికి దిగినా తిరస్కారం తప్పలేదు. అదీగాక, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంలోని దాని భయంకరమైన అబద్ధాలు, అపనిందలు, నేటి అభివృద్ధి నిరోధక సిద్ధాంతవేత్తలు ఎంతగా దిగజారిపోయారో తెలియజేస్తున్నాయి. అందువల్ల కమ్యూనిజం వ్యతిరేకత అనేది నైతికంగా విమర్శించాల్సిన అంశమే గాదు, ఒక నిజాయితీ పరుడు చేయలేని మోసపూరిత వృత్తి కూడ.

నైతికంగా ఆగ్రహించవలసిందే గాని, అది మాత్రమే సరిపోదు. కమ్యూనిస్టు వ్యతిరేక కల్లబొల్లి రాతలను బహిర్గతం చేస్తూ సైద్ధాంతిక, రాజకీయ రంగంలో కమ్యూనిస్టులు చేస్తున్న చురుకైన పోరాటం స్పష్టమైన ఫలితాలనిస్తోంది. సోవియట్ రష్యా, ఇతర సోషలిస్టు దేశాలపై నీచమైన ప్రచారం చేసినా, మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీల శాంతియుత సహజీవనం, శాంతియుత పోటీ లక్ష్యాలపైన నిందలు మోపినా, పెట్టుబడిదారీ దేశాలలోని శ్రామిక ప్రజలు కమ్యూనిస్టు వ్యతిరేకుల గావుకేకలను వినటం క్రమంగా మానివేశారు. వారి ఒక్కొక్క కట్టుకథ త్రోసివేయబడింది. అది జీవితం నేర్పిన సత్యం.

సోషలిస్టు దేశాలలో, ముఖ్యంగా సోవియట్ యూనియన్‌లో ఈ యుగపు సాంకేతిక, సైన్సు విజయాలు, ఆర్థికాభివృద్ధిలో తిరుగులేని ఆధిక్యత వల్ల కమ్యూనిస్టు వ్యతిరేకులు తమ ప్రచారాన్ని సైద్ధాంతిక రంగం వైపు మార్చుకోవలసి వచ్చింది. ఇది ఇపుడు బయటపడిన దాని రోగ లక్షణం. "అమెరికన్లకు కమ్యూనిజం అంటే అర్థం ఏమిటి?" అనే తన పుస్తకంలో నిక్సన్ స్పష్టంగా చెబుతాడు "రెండు వ్యవస్థల మధ్య పోటీ. పోటీ సైనిక, ఆర్థిక, సైన్సు రంగాలలో కాదు, అవి ముఖ్యమైనవే అయినప్పటికీ, ప్రధాన పోటీ రెండిటి భావజాలాల మధ్యనే".

మంచిదే, వాస్తవానికి ప్రచారంలోనే కాదు, రాజకీయాలలో కూడ కమ్యూనిస్టు వ్యతిరేకులు అన్ని రకాల పోరాటాల్ని వదులుకున్నారు. భావాల మధ్య ఘర్షణ మినహా. విభిన్న సామాజిక వ్యవస్థల మధ్య మనం చెప్పే శాంతియుత సహజీవనాన్ని ఇది పోలి వుంది. ఈ పోరాట ఫలితం స్పష్టమే. కమ్యూనిస్టుల శక్తి అపారం. వారి భావాలు అజేయం. మానవజాతి భవిష్యత్తుకు వారు శాస్త్రీయ రూపకల్పన చేస్తారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు భవిష్యత్తు లేదనేది నిజం. సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎంత సమర్థించుకున్నా, పెట్టుబడిదారీ విధానాన్ని ఎంతగా కాపాడుకోవాలనుకున్నా దాని ఓటమి తథ్యం. సోషలిజం, కమ్యూనిజం విజయాలు కమ్యూనిస్టు వ్యతిరేకుల వాదనల్ని నిరంతరం తిరస్కరిస్తున్నాయి. వారి వాదనలకు ఎలాంటి భూమిక లేదని నిరూపిస్తున్నాయి.

సామాజిక - చారిత్రక ప్రక్రియ అనే భౌతిక లక్ష్యాన్ని సాధించడాన్ని మన శక్తులు వేగవంతం చేయాలి. ప్రత్యేకంగా కమ్యూనిస్టు వ్యతిరేకులపై సైద్ధాంతికంగా, రాజకీయంగా ఎదురుదాడి చేయాలి.

పెట్టుబడిదారీ విధానం బలహీనమైన కొలదీ, కమ్యూనిస్టు వ్యతిరేకత క్రమంగా తగ్గిపోతుందనుకోవటం, దాని ఆత్మ అంతరించిపోతుందనుకోవడం పొరబాటు అవుతుంది. సోషలిస్టు దేశాల అభివృద్ధి పుష్కలంగా వున్నా, కమ్యూనిస్టు వ్యతిరేకత దానంతటదే కూలిపోదు. దానిని సైద్ధాంతికంగా, రాజకీయంగా ఓడించటానికి మనం పనిచేయాలి. అభివృద్ధి నిరోధకుల విషతుల్యమైన కమ్యూనిస్టు వ్యతిరేక భావాలను, ఆచరణను ఎదిరించి పోరాడాలి.

ఈ పోరాటంలో మనం విజయవంతమవుతామని, కమ్యూనిస్టు భావాలే గెలుస్తాయని సహజంగా మనకు విశ్వాసం వుంటుంది. కాని అది అంత సులభం కాదని మనకు తెలుసు. ప్రజలలో మన పలుకుబడి మరింత శక్తివంతంగా వుండేటట్లు మనం మన పోరాటాన్ని అభివృద్ధి చేయాలి. ఈనాడు కమ్యూనిస్టు వ్యతిరేక విధానం మొరటు పద్ధతులను విడనాడి, అది మరింత తెలివిగా, మృదువుగా, "శాస్త్రీయం"గా తయారవుతోంది. అయినా అది మనం చేసే వ్యక్తిగత పూజ లాంటి చిన్న పొరబాట్లను, తప్పులను పట్టుకొని కమ్యూనిస్టు ఉద్యమాన్ని, సిద్ధాంత ఆచరణను అపఖ్యాతిపాలు చేయాలని చూస్తుంది.

అందువల్ల కమ్యూనిస్టు వ్యతిరేక విధానంపై సంపూర్ణ విజయం సాధించాలంటే సామ్రాజ్యవాద బూర్జువావర్గం పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజానీకాన్ని మోసగించే అన్ని రకాల సైద్ధాంతిక, రాజకీయ ఆయుధాలను దాని ఆయుధాగారం నుండి పూర్తిగా తొలగించాలి. ఇది సిపిఎస్‌యు 20వ, 22వ కాంగ్రెసు అభివృద్ధి చేసి, విస్తృత పరిచిన లెనినిస్టు మార్గాన్ని కొనసాగించడంలో సిద్ధాంత, ఆచరణపరంగా ఎంత దృఢంగా వున్నామనే దానిపై ఆధారపడి వుంటుంది. రివిజనిస్టు, ఒంటెత్తు పోకడలకు వ్యతిరేకంగా మార్క్సిజం-లెనినిజం పవిత్రతను పరిరక్షించటానికి మనం ఖచ్చితంగా వ్యవహరించాలి. జాగరూకతగా వుండాలి. మన శ్రేణులు ఎంత దృఢంగా, అవిచ్ఛిన్నంగా, ఐక్యంగా వుంటే కమ్యూనిస్టు వ్యతిరేకులపై మన పోరాటం అంతగా విజయవంత మవుతుంది. అంతగా అంతిమ విజయానికి చేరువకాగల్గుతాం.

కమ్యూనిస్టు వ్యతిరేక విధానాన్ని ఎదుర్కోవటానికి మనకు తెలిసిన సత్యాలను పదేపదే వల్లె వేస్తే సరిపోదు. కమ్యూనిస్టు వ్యతిరేకుల వక్రీకరణ, తప్పుడు సూత్రీకరణకు వ్యతిరేకంగా ఇది తప్పదనుకోండి. అయినా మార్క్సిజం-లెనినిజం సృజనాత్మక అభివృద్ధిపై ఆధారపడి మనం పోరాడాలి. మన ఈ డైనమిక్ ప్రపంచంలో వాస్తవాలను, పరిణామాలను ఎప్పటికప్పుడు మదింపు చేసుకొని ముందుకు పోవాలి.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేక పనులకు ప్రత్యేక విభాగాలున్నాయి. ఇవి సమన్వయంతో పనిచేస్తే కమ్యూనిస్టు వ్యతిరేకతను అధిగమించవచ్చు. ఈ పనికి ప్రతి దేశంలోని నిర్దిష్ట పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలి. సైద్ధాంతిక, రాజకీయ కార్యాచరణ, కమ్యూనిజం గురించి సత్యాన్ని వ్యాప్తి చేయటం ద్వారా భవిష్యత్ సమాజాన్ని విప్లవీకరించడం ప్రతి ప్రత్యేక విభాగం బాధ్యత.

కార్మికోద్యమం పాత్ర, పెట్టుబడిదారీ సమాజంలో దాని స్థానం, దాని కర్తవ్య నిర్వహణ, ప్రపంచ పెట్టుబడి కూటమికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం - వీటి నుండే అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టులు ఉమ్మడి బాధ్యతతో కలిసి పనిచేయటం ఉత్పన్నమవుతుంది. "అన్ని దేశాల కార్మికులారా! ఐక్యం కండి!" ఐక్యత కోసం ప్రాణప్రదమైన ఈ గొప్ప పిలుపు జీవితం నేర్పిన సత్యం.

మన కాలంలో కమ్యూనిస్టులు ఉమ్మడి బాధ్యతతో అంగీకారమైన విషయాలపై కార్యాచరణకి దిగటం వలన ఉమ్మడి డాక్యుమెంట్లను రూపొందించగలుగుతున్నాం. జాతీయంగా, అంతర్జాతీయంగా బలాబలాలలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని కమ్యూనిస్టు మానిఫెస్టో భావాల్ని అభివృద్ధి చేసుకొంటున్నాం.

1957 డిక్లరేషన్, కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీ ప్రతినిధుల సభ 1960 ప్రకటన అలాంటి డాక్యుమెంట్లే. ఈ డాక్యుమెంట్ల సందేశం ఏమిటంటే, సామాజిక పునర్నిర్మాణం కోసం అంగీకారమైన విషయాలపై మనం చేసే కార్యాచరణ విజయం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతపై ఆధారపడి వుంటుంది. అన్ని మార్గాలలో ఈ ఐక్యతను బలపరిచి దృఢతరం చేయటం మన బాధ్యత.

కమ్యూనిస్టుల అంతర్జాతీయ మహాసభల డాక్యుమెంట్లు మన కార్యాచరణకు గైడ్‌లాంటివి. నిర్దిష్ట పరిస్థితులలో సృజనాత్మక ఆచరణతో మనందరి ఉమ్మడి లక్ష్యం - కమ్యూనిజం.

ఇపుడు మనం చర్చిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక విధానం ఓటమి సూత్రబద్ధమైన ఇతర ప్రశ్నలను పరిష్కరించటానికి ఈ డాక్యుమెంట్లు గైడ్‌గా వుంటాయి. 1960 స్టేట్‌మెంట్ ఇలా చెప్పింది. "కార్మికవర్గ ప్రయోజనాల్ని శక్తివంతంగా కాపాడటానికి, శాంతిని కొనసాగించటానికి, కార్మికవర్గ, సోషలిస్టు భావాలను సఫలం చేయటానికి కమ్యూనిస్టు వ్యతిరేక విధానాన్ని దృఢంగా ఎదిరించి పోరాడాలి. లేదంటే బూర్జువా వర్గం ఉపయోగించే ఆ విషపూరిత ఆయుధం ప్రజల్ని సోషలిజం నుంచి వేరుచేస్తుంది".

మన శ్రేణుల ఐక్యతను పదిలం చేసుకొనటం ద్వారా ఈ పోరాటంలో మనం మరిన్ని విజయాల్ని సాధించగలం.

ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ విజయాలు (ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో) కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారంలోని అబద్ధాన్ని పటాపంచలు చేస్తాయి. కమ్యూనిజం యెడల బూర్జువావర్గం వ్యాప్తి చేసే భ్రమల కంటె సోషలిస్టు వాస్తవికత బలమైనది. కమ్యూనిస్టు వ్యతిరేకతను ఎదుర్కోవాలంటే సైద్ధాంతిక రంగంలో విస్తృతంగా పనిచేయటం ముఖ్యం. అదే సరిపోదు. పెట్టుబడిదారీ దేశాలలోని కమ్యూనిస్టులందరూ రాజకీయ కార్యాచరణలో పాల్గొనటం తప్పనిసరి. ఈ పని పద్ధతిపైనే, దాని సామర్థ్యం పైనే అన్ని ఖండాలలోని, అన్ని దేశాలలోని కమ్యూనిజం భావాల విజయం ఆధారపడి వుంది.

కమ్యూనిజం వ్యతిరేకతను ఎదిరించి పోరాడటం అంటే, శాంతి, ప్రజాస్వామ్యం కోసం, వ్యక్తి, ప్రజలందరి స్వేచ్ఛ కోసం, మనిషిగా జీవించే మంచి పరిస్థితుల కోసం పోరాటం. కమ్యూనిస్టుల ప్రయత్నాలన్నీ అందుకోసమే.

మరో విషయం చెప్పాలి. కమ్యూనిస్టు వ్యతిరేకతను ఎదిరించే పోరాటంలో దాని ప్రత్యేక లక్షణాల్ని గుర్తించటం ముఖ్యం. అది పూర్తిగా ప్రతికూల అంశం. బొత్తిగా కమ్యూనిజానికి వ్యతిరేకమైనది. సామ్రాజ్యవాద దురాక్రమణదారులకు భిన్నమైన మరో కార్యక్రమం దానికి లేదు. ప్రజాస్వామిక పోరాటంతో సాధారణ సంబంధం లేకుండా కమ్యూనిస్టు వ్యతిరేక విధానంతో ప్రత్యేక పోరాటం ఏదీ వుండదు. ఆ పోరాట కార్యాచరణ సామాజిక పునర్నిర్మాణమే లక్ష్యంగా కలిగి వుంటుంది.

కమ్యూనిస్టు వ్యతిరేక సిద్ధాంతం స్వభావం, గుత్త పెట్టుబడిదారీ విధానంతో దాని లింకు స్పష్టంగా చెబుతున్నది ఏమంటే ఆ రెండింటికి వ్యతిరేకంగా జరిగే పోరు సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాస్వామిక సాధారణ పోరాటంలో ఒక భాగమే, చాలా ముఖ్యమైన ఒక భాగమే. ఈ పోరాటాన్ని కొద్దిపాటి గుత్త పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా జరిపే పోరాటంతో జతచేస్తే కమ్యూనిజం వ్యతిరేకతను నిర్మూలించవచ్చు.

– **న్యూ ఏజ్,** అక్టోబర్ 1962

*****